రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు
8125972476

క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక




## చక్రం తిప్పిన చక్రవర్తి

కివీస్‌పై టీమ్ఇండియా ఘన విజయం

రేపు ఆస్ట్రేలియాతో రేపు సెమీ ఫైనల్


2



EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక 176 | సోమవారం 3 మార్చి 2025 | వెల : 3 రూ/.. | పేజీలు - 8


# సౌర విద్యుత్ లో మహిళలకు పవర్

అదానీ-అంబానీలను తలదన్నే సమర్థులుగా తెలంగాణ ఆడబిడ్డలు

మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం

వనపర్తి జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం



అదానీ-అంబానీలే కాదు, తెలంగాణ ఆడబిడ్డలు సైతం పవర్ ప్రాజెక్టులు నిర్వహించగల సమర్థులు అని చాటి చెప్పేలా మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మహిళలతో పాటు రైతులు, యువతకు కూడా ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వనపర్తి జిల్లా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక కేడీఆర్ పాలిటెక్నిక్ కాలేజీ మైదానంలో మహిళలు వేలాదిగా పాల్గొన్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "వనపర్తిలో నేను నేర్చుకున్న రాజకీయ చైతన్యం తోనే తెలంగాణ ముఖ్యమంత్రిగా మీ ముందు నిలబడ్డాను. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతోంది. రాష్ట్రంలో 25 లక్షల 50 వేల మంది రైతులకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ జరిగింది. రైతు భరోసా నిధులను కూడా ఖాతాల్లో వేశాం. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లకు పైగా పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నాం. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 50 లక్షల కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. ఇప్పటివరకు 150 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారు. దాని కోసం రూ.4500 కోట్లు చెల్లించాం.



స్వయం సహాయక సంఘాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. సున్నా వడ్డీ, పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళా సంఘాలకు పునరుజ్జీవం కల్పించాం. రాష్ట్రంలో 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వనపర్తి సాక్షి గా ఈ రోజు రూ.1000 కోట్ల రుణాలను ఆడబిడ్డలకు ఇచ్చాం. హైటెక్ సిటీ శిల్పారామం పక్కనే స్వయం సహాయక మహిళల కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశాం. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థల పక్కనే మహిళా సంఘాలకు మూడున్నర ఎకరాల స్థలం ఇస్తారని ఎప్పుడైనా ఊహించారా?. అదానీ, అంబానీ లే కాదు తెలంగాణ స్వయం సహాయక మహిళలు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నాం. 1000 బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్టీసీ కి అద్దెకు ఇచ్చేలా చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు బట్టలు కుట్టే పనిని స్వయం సహాయక మహిళలకు కల్పించాం. ప్రభుత్వ పాఠశాలను నిర్వహించే బాధ్యతను కూడా ఇచ్చాం. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల ను మహిళల పేరుతో ఇస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యం లో మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలు ఇచ్చాం. దేశ చరిత్రలో ఇదొక రికార్డు. 22 వేల టీచర్లకు ప్రమోషన్లు, 35 వేల టీచర్లకు బదిలీలు చేసి వారి సమస్యలు పరిష్కరించాం. మెట్రో రైలు విస్తరణ నుంచి మూసీ పునరుజ్జీవం దాకా తలపెట్టిన అన్ని పనులను పూర్తి చేసి తీరుతాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.



# అవసరమైతే రోబోల సాయం తీసుకోండి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరుగొద్దు

అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

మంత్రుల బృందంతో కలిసి సహాయక చర్యల పరిశీలన

**నాగర్‌కర్నూల్, మార్చి 2 (క్విక్ టుడే న్యూస్):**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో మనుషులు, మిషిన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2005-2006లో ప్రారంభించారని, 2014 తెలంగాణ ఏర్పడే నాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయిందని గుర్తు చేశారు. కానీ, గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని ఆరోపించారు. ఆదివారం ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద కొనసాగుతున్న సహాయక పనులను మంత్రుల బృందంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. రక్షణ చర్యలకు సంబంధించి బృందాలను సీఎం ఆరా తీశారు. సహాయక చర్యలను సీఎంకు రెస్క్యూ టీమ్ అధికారులు వివరించారు. కాసేపు సొరంగ మార్గంలో పనులను పరిశీలించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బయటకు వచ్చి సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. సొరంగంలో చేపట్టిన సహాయక చర్యలకు సంబంధించి సీఎం, మంత్రులకు వివరించారు. ఆపరేషన్‌లో ఇబ్బందులను సీఎం రేవంత్‌కు రెస్క్యూ టీమ్ వివరించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి తన అభిప్రాయాలు రెస్క్యూటీమ్‌తో పంచుకున్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా రూపొందించుకోవాలని, ప్రధాని మోదీ కూడా తరచూ సహాయ చర్యలపై ఆరా తీస్తున్నారని, తాను ప్రధానిని కలిసినప్పుడు ఆయన వివరాలు అడిగారని తెలిపారు. ఇంకా ఏదైనా సహాయం కావాలంటే ఉత్తమ్‌ను అడగాలని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ అంశం గురించి చర్చించుకుంటున్నారని అన్నారు.



ఆపరేషన్‌కు సంబంధించి ప్రతి అంశాన్ని డాక్యుమెంట్‌గా మార్చాలని తెలిపారు. సమయం వృథా కాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని సీఎంకు అధికారులు తెలిపారు.

## హుడా లేఅవుట్ ముసుగులో


# భూ కబ్జా!




### ఎన్‌టీపీసీ ల్యాండ్‌ను మింగేసిన రియల్టర్లు

**విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో.(క్విక్ టుడే న్యూస్):**
అనకాపల్లిజిల్లా, పరవాడ మండలం, దేశపాత్రునిపాలెం గ్రామ రెవిన్యూ పరిధిలో వ్యాపారం చేయాలనుకుంటే కాదేది అనర్హం అన్నట్లు రియల్టర్ దొడ్డి దారిన కోట్లాది రూపాయలు సంపాదించుకునేందుకు ఎన్‌టీపీసీ ల్యాండ్ కూడా మింగేశారు. ల్యాండ్ మాఫియా సామ్రాజ్యం మారుమూల ఉన్న గ్రామ ప్రాంతాలకు కూడా విస్తరించింది. వివరాల్లోకి వెళితే , దేశపాత్రునిపాలెం గ్రామ రెవిన్యూ పరిధిలో గల ,70-2.70-3 సర్వే నెంబర్లలో భూమి గతంలో ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉన్నది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ భూమిని మాజీ సైనికుల జీవనోపాధి కోసం నిబంధనల ప్రకారం మంజూరు చేసియున్నారు. 1999 సంవత్సరం లో పరవాడ మండలం లోని దేశపాత్రునిపాలెం గ్రామం ద్వారా వెళ్లే రైల్వే లైన్ కోసం రైల్వే శాఖ కొంత భాగాన్ని కూడా అక్విజేషన్ చేసి ఉన్నారు. అదే సర్వే సర్వే నెంబర్ లో, వైస్సార్సీపీ ప్రభుత్వం ఉడా ల్యాండ్ పూలింగ్ GOMS నెంబర్ 72 ప్రకారం రైతుల వద్ద నుండి అతుకుబడిన పట్టాలను భూ సేకరణ చేసియున్నారు. భూ సేకరణ నిమిత్తం ఆ భూమిపై హక్కు కలిగి ఉన్న రైతులకు ఒక ఎకరానికి 900 గజాలు చొప్పున మంజూరు చేస్తూ ఇస్తానని ప్రభుత్వం LPOC పట్టాలు ఇచ్చియున్నారు సదరు భూ సేకరణ లో నష్టపోయిన రైతులకు ఎన్‌టీపీసీ ల్యాండ్ అక్విజిసియాన్ లో తీసుకున్న భూమిలో ఎల్‌పీవోసీ పట్టాలు ప్రభుత్వ గైడ్లెన్స్ ప్రకారం మంజూరు చేసి ఉన్నారు. కానీ అక్రమ సంపాదన కోసం కొందరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అధికారులు ఎదుట నిజాలను దాచిపెట్టి లేఔట్లు వేసి విగ్రహాలు జరిపించి కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. లేఅవుట్ కి అనుమతి మంజూరు చేయాలంటే, ఆ భూమి పైకి రెవెన్యూ అధికారులు వెళ్లి వాస్తవాలను నివేదిక రూపంలో అందజేయాలి, కానీ కొందరు రెవెన్యూ అధికారులు రియాల్టర్లు మాయలో పడి వాస్తవాలను వక్రీకరించి తప్పుడు నివేదికలు ఇవ్వడంతో, ఇతరులకు కేటాయింపబడిన భూముల్లో కూడా హుడా లేఔట్ ముసుగులో రియల్ ఎస్టేట్లో వెళుతున్నాయి. తప్పుడు నివేదికలతో హుడా ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నటువంటి వారిపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించి చర్య తీసుకోవాల్సిన అవసరం ఉంది ప్రజా సంఘాలు కోరుతున్నారు.





### ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ

# ఎర్రబెల్లికే ఇవ్వాలి

**తొర్రూరు మార్చి 2(క్విక్ టుడే న్యూస్):**




రాష్ట్రంలో పదవీ కాలం పూర్తి అవుతున్న నాలుగు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల స్థానాలకు జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు దక్కే రెండు స్థానాల్లో పార్టీ తరఫున సీనియర్ నాయకుడైన ఎర్రబెల్లి దయన్నకు ఒక స్థానంలో అవకాశం ఇవ్వాలని ప్రముఖ సామాజికవేత్త, సాహితీవేత్త దొనికెన కుమారస్వామి కోరారు. రాజకీయాల్లో సొసైటీ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, విప్ గా, ఎంపీగా, మంత్రిగా అపారమైన అనుభవం ఉండడమే కాకుండా కింగ్ మేకర్ గా రాజకీయ చతురతతో చక్రం తిప్పి, సమయస్ఫూర్తితో చాకచక్యంగా ఎంతో మంది సాధారణ కార్యకర్తలను పెద్ద పెద్ద నాయకులుగా తయారు చేసి, వారికి పార్టీ పరమైన, రాజ్యాంగ పరమైన ఎన్నో ఉన్నత పదవులను ఇప్పించిన మహా నాయకుడైన ఎర్రబెల్లి దయన్నకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశాన్ని కల్పిస్తే, సునాయాసంగా గెలిచి చూపించ గలడని దొనికెన అన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో బీఆర్ఎస్ అధిష్టానం వ్యూహాత్మకంగా అవలంభిస్తున్న పథకానికి సరైన నాయకుడు ఎర్రబెల్లి దయన్నేనని, అవసరమైతే రాజకీయంగా ఏమైనా చేసి గెలిచి చూపించే దమ్మున్న నాయకుడు ఎర్రబెల్లి దయన్నని దొనికెన అన్నారు. శాసనసభలో బీఆర్ఎస్ కు ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యాబలం పరంగా తప్పకుండా ఒక్క ఎమ్మెల్సీ దక్కుతుండగా, దయన్నకు అవకాశం ఇస్తే బీఆర్ఎస్ మరొక ఎమ్మెల్సీ సీటును కూడా పొందవచ్చునని దొనికెన అభిప్రాయపడ్డారు.

### శ్రీపాదరావు జీవితాన్ని

# స్ఫూర్తిగా తీసుకోవాలి

### బోప్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్




**తొర్రూరు మార్చి 2(క్విక్ టుడే న్యూస్):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బోప్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని ఆదివారం డివిజన్ కేంద్రంలో బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అరుదైన నాయకులలో శ్రీపాదరావు ఒకరని, వారి సేవలను గుర్తించి జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన నాయకుడు శ్రీపాదరావు అని, ఆయన ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్గా సమర్థ వంతంగా విధులు నిర్వహించారన్నారు. తండ్రి బాటలో మంత్రి శ్రీధర్ బాబు నడుస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడని తెలిపారు. రాజకీయాలకు వన్నె తీసుకువచ్చాడని కొనియాడారు.

### టీ 10 క్రికెట్ ఛాంపియన్‌గా

# మోడల్ స్కూల్ పెబ్బేర్ జట్టు



**పెబ్బేర్, మార్చి 2 (క్విక్ టుడే న్యూస్):**

టీ 10 క్రికెట్ లో రాష్ట్రస్థాయిలో మోడల్ స్కూల్ పెబ్బేర్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. మూడు రోజులపాటు మేడ్చల్ జిల్లా ఇ.సి.ఐ.ఎల్ లో జరిగినటువంటి టీ10 అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్ లో ఫైనల్ మ్యాచ్ కామారెడ్డి పై మొదట బ్యాటింగ్ ఎంచుకున్న వనపర్తి జట్టు 10 ఓవర్లలో 108 రన్స్ చేయగా రెండవ ఇన్నింగ్స్ లో కామారెడ్డి 50 రన్స్ కి అల్ అవుట్ అయ్యింది. దీంతో 58 పరుగుల తేడాతో వనపర్తి జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిడి శ్రీధర్ , కోశాధికారి సందీప్ చేతుల మీదుగా ట్రోఫీ నగదు బహుమతి రూ.30 వేలు అందుకోవడం జరిగింది.మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్, కోచ్ లు మనోహర్ ,శంకర్, క్రికెట్ జట్టులోని విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# సందడిగా భట్రాజు ఆత్మీయ సమ్మేళనం

### సమ్మేళనానికి తరలివచ్చిన బంధుగణం

**తొర్రూరు మార్చి 2(క్విక్ టుడే న్యూస్):**



జీవిత ప్రయాణంలో నిత్యం బిజీగా గడిపే వారంతా ఒక్కచోట పోగయ్యారు. వృత్తి జీవితాన్ని కాసేపు పక్కన పెట్టి బంధువులతో ఆనందంగా గడిపారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా అనుబంధాలను, బంధుత్వాలను పటిష్టం చేసుకున్నారు. ఆరు తరాల బందు గణమంతా తరలిరాగా కొత్త తరానికి పాత తరాన్ని పరిచయం చేశారు. ఈ అనుబంధాల కలయికకు తొర్రూరులో నిర్వహించిన భట్రాజు కుల ఆత్మీయ సమ్మేళనం వేదికైంది. పట్టణంలోని సాంప్రదాయ ఫంక్షన్ హాల్ లో ఆదివారం భట్రాజు కుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆరు తరాలకు చెందిన 141 కుటుంబాలు ఒకే వేదికపై కలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. తొర్రూరు , గుర్తూరు, వెలికట్ట గ్రామాలకు చెందిన భట్రాజు బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ మండలంలోని



భట్రాజు కుల బంధు గణమంతా ఒక్కచోటికి చేరి ప్రేమ, ఆప్యాయతలను కలబోసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు ఐక్యతకు దోహదపడతాయని, కులంలో ఎదిగిన వారు సామాజిక వర్గ అభ్యున్నతికి పాటుపడాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్ రాజు లు కోరారు. పూర్వం రాజుల కాలంలో కవీశ్వరులుగా, మేధో సంపన్నులుగా భట్రాజులు పేరుగాంచారని కొనియాడారు. ఐక్యతతోనే ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరిస్తాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కుల ప్రముఖులు ప్రతి కంఠం దేవేందర్ రాజు, కళాధర్ రాజు, కృపాకర్ రాజు, భాస్కర్ రాజు, నారాయణ రాజు, దయాకర్ రాజు, విశ్వధర్ రాజు, అశోక్ రాజు, సత్యాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా భూమి పట్టా చేసుకుని బెదిరింపులు

### భయభ్రాంతులకు గురి చేస్తున్న వల్లపు సాయిలు

### మీడియాతో గోడువెల్లబోసుకున్న వల్లపు వెంకన్న

**తొర్రూర్ మార్చి 2(క్విక్ టుడే న్యూస్):**



అక్రమంగా భూమిని పట్టా చేసుకోవడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తొర్రూరు మండలం మాటేడు గ్రామానికి చెందిన వల్లపు వెంకన్నతెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తల్లిదండ్రులు సంపాదించిన పన్నెండు ఎకరాలు భూమి ఉంది. ఈ భూమిలో అన్నదమ్ములకి ఐదు ఎకరాల భూమిని పంచగా మిగిలిన రెండు ఎకరాల భూమిని తల్లిదండ్రుల బ్రతుకు బాగోగులకు వారి పేరు పైన పట్టా చేయించారు. ఇరువూరు అన్నదమ్ములు తల్లిదండ్రులను బాగోగు లను చూసుకోకపోవడంతో వారు వారికి సంబంధించిన రెండు ఎకరాల భూమిని, అదేవిధంగా పంచుకోగా నాకు వచ్చిన ఐదు ఎకరాల భూమిని కూడా హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తికి విక్రయించడం జరిగింది. 2018–2019 సంవత్సరంలో వల్లపు సాయిలు తల్లిదండ్రులకు సంబంధించిన భూమిని అక్రమంగా తన పేరుపై పట్టాను చేయించడం జరిగింది. ఈ విషయంపై పలుమార్లు స్థానిక తాహసిల్దార్ దృష్టికి తీసుకున్నప్పటికీ కూడా అక్రమ పట్టను తొలగించకపోవడంతో ఇప్పటివరకు వల్లపు సాయిలు పేరు పైనే పట్టా వస్తుంది.ఈ క్రమంలో తల్లిదండ్రుల భూమిని కొన్న వ్యక్తి భూమి చుట్టూ కనిలతో ఫెన్సింగ్ చేసుకోగా ఆ కనిలను వల్లపు సాయిలు వీరగా కొట్టడంతో భూమిని కొన్నవారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా,సాయిలు తప్పును ఒప్పుకొని భూమి నాది కాదని తిరిగి కనీలను అదే సాయిలు నాటించడం జరిగింది. హైదరాబాద్ కు చెందిన వ్యక్తి తన భూమిని తొర్రూర్ పట్టణ కేంద్రానికి చెందిన కోటిరెడ్డికి విక్రయించగా ఈ భూమిని మళ్లీ తిరిగి వల్లపు సాయిలు పేరు పై పట్టా ఉందని భూమిని కొనుగోలు చేసిన కోటిరెడ్డి దౌర్జన్యం చేస్తున్నాడు. కావున సంబంధిత రెవెన్యూ అధికారులు భూమి లేకున్నా పట్టా ఉందని అమ్ముకున్న వారిపై నా కుటుంబంపై దాడి చేస్తున్న వల్లపు సాయిలు పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అతని పేరుపై ఉన్న పట్టాను తొలగించాలని అధికారులను కోరారు.

## జిల్లాల రాజిరెడ్డిని పరామర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ఆత్మకూర్ (ఎం), మార్చి 2 (క్విక్ టుడే న్యూస్):**

ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది కోలుకుంటున్న ఆత్మకూరు మండలం కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జిల్లాల రాజిరెడ్డిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. ఆదివారం ఆత్మకూర్ లోని ఆయన నివాసానికి విచ్చేసి ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు ధైర్యాన్ని నింపారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాస లక్ష్మారెడ్డి, జన్నాయికోడె నగేశ్, దీగోజు నరసింహ చారి, కట్టెకోల హనుమంతు, మల్లేశంగౌడ్ తదితరులు ఉన్నారు.

### చక్రం తిప్పిన చక్రవర్తి

## టీమ్ఇండియా గ్రాండ్ విక్టరీ

### రేపు ఆస్ట్రేలియాతో రేపు సెమీ ఫైనల్

**దుబాయ్, మార్చి 2 (క్విక్ టుడే న్యూస్):**



ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ స్టేజ్‌లో ఆఖరి మ్యాచ్‌లోనూ టీమ్ఇండియా ఘన విజయం సాధించింది. దుబాయ్ వేదికగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో నెగ్గింది. 250 పరుగుల లక్ష్య ఛేదనలో కివీస్ 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. కేన్ విలియమ్సన్ (81 పరుగులు) ఒక్కడే రాణించాడు. టీమ్ఇండియా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 5 వికెట్లతో కివీస్ పతనాన్ని శాసించాడు. కుల్దీప్ యాదవ్ 2, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య తలో 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (79 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించగా, అక్షర్ పటేల్ (42 పరుగులు), ఆఖర్లో హార్దిక్ పాండ్య (45 పరుగులు) ఆకట్టుకున్నారు. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (2), రోహిత్ శర్మ (15), విరాట్ కోహ్లి (11), కేఎల్ రాహుల్ (23), జడేజా (16) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5, కైల్ జెమిసన్, ఓ రూర్కీ, శాంట్నర్, రచిన్ రవీంద్ర తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో టీమ్ఇండియా గ్రూప్ ఏ లో టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇక భారత్–ఆస్ట్రేలియా మధ్య మంగళవారం తొలి సెమీ ఫైనల్ జరగనుంది. అటు రెండో సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్ – సౌతాఫ్రికా పోటీపడనున్నాయి.